ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 2025 - 26 విద్యా సంవత్సరానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. విదేశాల్లో గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయాల్లో చదువుకోవాలనుకున్న వారికి ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. నవంబర్ 11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా 95738 59268 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



స్థానిక ఎన్నికలకు సహకరించాలి

▸ కలెక్టర్ ప్రతీక్ జైన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగానికి చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ తప్పక పాటించాలన్నారు. జిల్లాలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ కోసం డీఈఓ, బ్యాలెట్ బాక్స్ మేనేజ్‌మెంట్ కోసం డీపీవోను, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్(08416 235291) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీపీవో జయసుధ, తదితరులు పాల్గొన్నారు.









రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

▸ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ, వికారాబాద్ నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయ దశమి పండుగ సందర్భంగా మీరు చేపట్టిన అన్ని పనులలో సంపూర్ణ విజయాలను సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, బంధు మిత్ర సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి అందరూ దసరా పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు
దుర్గామాతకు ప్రత్యేక పూజలు 9

చెట్టుకు ఢీకొన్న కారు
ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు 8



జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ప్రజలకు కలెక్టర్ మను చౌదరి విజయ దశమి దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి దర్గాదేవి కరుణ కటాక్షాలు ఉండాలని, అన్నింటా అందరికీ విజయం సిద్ధించాలని ఆకాంక్షించారు. అలాగే ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.







పోటీకి ఆరాటం.. రిజర్వేషన్లపై సందిగ్ధం

- హైకోర్టు తీర్పుపైనే నాయకుల దృష్టి
- పండుగ పూట ఖర్చు విషయంలో ఊగిసలాట
- స్థానిక ఎన్నికలపై స్పష్టత లేక అయోమయం


కులకచర్ల ఎంపీడీవో కార్యాలయం

కులకచర్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలకు నగరా మోగడంతో పోటీలో నిలిచేందుకు నాయకులు, ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నా మరో ఇప్పటి నుంచే ఖర్చు చేయాలా? వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. పోలింగ్ షెడ్యూల్ విడుదలైనా ఈ నెల 8వ తేదీన హైకోర్టు తీర్పుపై ఆధారపడి ఉండటం ఉత్కంఠ నెలకొంది. కులకచర్ల మండలంలో జెడ్పీటీసీ, 12 ఎంపీటీసీలు, 33 పంచాయతీలు ఉన్నాయి. కాగా పరిషత్‌ల ఎన్నికలు రెండో విడత ఈ నెల 27న, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడో విడత నవంబరు 8న జరగనున్నాయి.

రిజర్వేషన్లపై తర్జన భర్జన

ఆశావాహుల్లో కొందరికి ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. రిజర్వేషన్ అనుకూలించని వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. దసరాకు ముందే ఎన్నికల హడావుడి నెలకొంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందు, వినోదాల కోసం ఖర్చు చేస్తున్నారు. అయితే ఇవే రిజర్వేషన్లు ఫైనల్ అవుతాయా? ఇప్పట్లో ఎన్నికలు జరుగుతాయా? కోర్టు తీర్పు ఎలా ఉంటుందో? అనే తర్జనభర్జనలో ఉన్నారు. అయితే బీసీ రిజర్వేషన్లపై నెలకొన్న సందిగ్ధతకు కోర్టు తీర్పుతోనే తెరపడనుంది. పండగ పూట ఖర్చు చేయాలా.. వద్దా? అని గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పుడే భారీగా ఖర్చు చేస్తే తీరా రిజర్వేషన్లను రద్దుచేస్తూ కోర్టు తీర్పు ఇస్తే ఎలా? అని సందిగ్ధంలో పడ్డారు. ఇదే అదునుగా ప్రత్యర్థులు విందు వినోదాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రలోభాలకు దిగితే తామెక్కడ వెనకబడి పోతా మో? అనే ఆలోచనలోనూ ఉన్నారు. ఏదేమైనా ఎన్నికల షెడ్యూల్‌తో రాజకీయ ఆశావహులు, నాయకులు వ్యూహాల్లో నిమగ్నమయ్యారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిక

బొంరాస్‌పేట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో బుధవారం బీజేపీ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి మహేశ్‌కుమార్ తదితరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జగదీశ్‌సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగురావు, ఉప్పు జగదీశ్వర్, రాజునాయక్, అనిల్, జనార్దన్, నర్సిములు, శివకుమార్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీలో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

బషీరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నాయకుడు కె.రాఘు, బీఆర్‌ఎస్ నాయకుడు బీజే వెంకట్‌తోపాటు ఆయా పార్టీల కార్యకర్తలు చేరారు. కార్యక్రమంలో బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, నవాంద్గీ సొసైటీ, ఏఎంసీ వైస్‌చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, సొసైటీ డైరెక్టర్ బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

రైతు బిడ్డకు మెడిసిన్ సీటు



కేశంపేట, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): రైతు బిడ్డ కష్టపడి చదివి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి మెడిసిన్ సీటు పొందింది. గ్రామీణ నేపథ్యం ఉన్న రైతు కుటుంబంలోని ఆడబిడ్డకు మెడికల్ సీటు రావడంపట్ల గ్రామస్తులు అభినందిస్తున్నారు. తొమ్మిదిరేకులకు చెందిన రైతు దంపతులు పి.రామ్‌రెడ్డి-శ్రీదేవి కూతురు మనోజ్ఞ ఇంటర్ హైదరాబాద్‌లో చదివి నీట్ పరీక్ష రాసి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సంధించింది. మనోజ్ఞను గ్రామస్తులు అభినందించారు.

విజయదశమిని ఘనంగా జరుపుకోవాలి


అమ్మవారి సేవలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయదశమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బహార్‌పేట్ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు బుధవారం ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

అందరికీ విజయాలు కలగాలి


మహేందర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత కృపతో ప్రజలకు విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. సుఖశాంతులు కలగాలని అభిలషించారు.

ఆక్రమణ కూల్చివేతపై హైడ్రా వెనక్కి

- తామే పునరుద్ధరిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ


జోడిమెట్ల చౌరస్తా వద్ద నాలాల పునరుద్ధరణపై చర్చిస్తున్న ఆయా శాఖల అధికారులతో మాట్లాడుతున్న మేధా పరిశ్రమ ప్రతినిధులు

ఘట్‌కేసర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద మేధా పరిశ్రమ ఆక్రమణలో ఉన్న నాలాను పునరుద్ధరించేందుకు హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు బుధవారం హడావుడి చేసి వెనుదిరిగారు. గంటపాటు పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టే తరుణంలో పరిశ్రమ ప్రతినిధులు వచ్చి తామే నాలాను పునరుద్ధరించి వరద దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందుకు మూడు రోజుల గడువు కావాలని కోరారు. ఇందుకు అధికారులు హామీ పత్రాలు ఇవ్వాలని అధికారులు సూచించారు. యాజమాన్యం అంగీకరించినా హిమగిరి కాలనీవాసులు, నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏళ్లుగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే నాలాను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాం, హైడ్రా సిబ్బంది, మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న రవీందర్

మర్పల్లి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు భరోసాగా నిలుస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. బుధవారం బూచన్‌పల్లికి చెందిన సిరిపురం నర్సింహారెడ్డి, ఎన్కెపల్లి శివప్రసాద్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తూ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కుంచారం జగన్‌మోహన్‌రెడ్డి, మల్లయ్య, కుంచారం గోపాల్‌రెడ్డి, బక్కప్పుల జగన్‌మోహన్‌రెడ్డి, బూచన్‌పల్లి రవీందర్‌రెడ్డి, ఎక్కిలి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక భర్తను హతమార్చిన భార్య


శ్రీనివాస్ మృతదేహం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాగొచ్చి నిత్యం వేధిస్తుండటంతో ఓ భార్య భర్తను హతమార్చిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న శ్రీనివాస్(45) వృత్తి రీత్యా భవన కార్మికుడు. రోజూ మద్యం తాగి భార్య సావిత్రిని, పిల్లలను వేధించే వాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం తాగి ఇంటికొచ్చిన శ్రీనివాస్ సావిత్రిపై దాడికి పాల్పడగా ఆమె ఎదురు దాడికి దిగి కర్రతో శ్రీనివాస్‌ను చితక బాదింది. దీంతో శ్రీనివాస్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బరిలో దిగేందుకు యువ వైద్యుడి ఆసక్తి


డాక్టర్ విహసిత్

తాండూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాండూరు బాలాజీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సంపత్‌కుమార్ తనయుడు డాక్టర్ విహసిత్ యాలాల జెడ్పీటీసీగా పోటీచేసేందుకు సిద్ధమయ్యారు. ఎంఎస్ ఆర్థో వైద్యుడిగా ఉన్న విహసిత్‌ను రంగంలో దింపేందుకు సంపత్‌కుమార్ మండల నాయకులతో చర్చిస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే పోటీకి ఆసక్తి చూపుతున్నారు. విహసిత్ తల్లి సునీత తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. గత ఎన్నికల్లో యాలాల జెడ్పీటీసీకి నామినేషన్ వేయగా ముగ్గురు సంతానం ఉన్నారనే కారణంతో పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో బుధవారం సంపత్‌కుమార్ భేటీ అయి ఇదే విషయమై చర్చించినట్టు తెలుస్తోంది.

హామీల అమలు తర్వాతే ఓట్లు అడగాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్/కొడంగల్/దౌల్తాబాద్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలో పర్యటించిన ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ బాకీ కార్డును బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల యాదగిరి, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, రామకృష్ణయాదవ్, రమణారెడ్డి, శ్రావణ్‌గౌడ్, అనంత్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే కొడంగల్, దుద్యాలల్లో నరేందర్‌రెడ్డి పర్యటించారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ బాకీ కార్డులను నాయకులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దౌల్తాబాద్ మండలంలో పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. అనంతరం దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, భీములు, పకీరప్ప, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద జమ్మి మొక్కలు నాటాలి


జమ్మి మొక్క నాటుతున్న స్వప్న

తాండూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ తాండూరులోని పలు ఆలయాల వద్ద దసరా సందర్భంగా జమ్మి మొక్కలను నాటారు. కాళికామాత ఆలయం, రాఘవేంద్ర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యావేత్త కీర్తిశర్మ ఉన్నారు.

కొడంగల్ అభివృద్ధికి సహకరించాలి

కొడంగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారిని 60ఫీట్ల వరకు విస్తరిస్తామని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి వినాయక చౌరస్తా మీదుగా మహాలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు విస్తరణ పనులు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముస్తాక్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.


గరుడవాహనంపై ఊరేగిన అనంతుడు

- నేడు అశ్వ వాహన సేవ.. జమ్మి కట్టకు అనంతపద్మనాభస్వామి


అనంత పద్మనాభస్వామికి గరుడవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు


అనంతపద్మనాభ స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. బుధవారం నిత్య వాహన సేవల్లో భాగంగా ఉదయం స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ దంపతులు, ఆయా పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు హాజరు కాగా మాజీ ఎమ్మెల్యే స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామి వారిని హంస వాహనంపై ఊరేగించారు. దసరా సందర్భంగా నేడు స్వామి వారు అశ్వ వాహనంపై జమ్మి కట్టకు చేరుకుని భక్తులకు దర్శనమిస్తారు. అక్కడే రావణ దహణం నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా వచ్చిన అనంతపద్మనాభ స్వామి మళ్లీ ఆలంపల్లి చేరుకుని మరుసటి రోజు అనంతగిరికి చేరుకుంటారు.









అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

యాలాల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి బెన్నూరు గ్రామం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందిందని ఎస్‌ఐ తెలిపారు. తమ సిబ్బంది వెళ్లి చూడగా, రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారని అన్నారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిరుద్యోగ సమస్యలపై ఉద్యమిస్తాం

కులకచర్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కండె గణేశ్ అన్నారు. బుధవారం కులకచర్లకు వచ్చిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా కండె గణేశ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. నిరుద్యోగ సమస్యపై బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు భజరంగ్, చంద్రకాంత్, మైపాల్, హరికృష్ణ, చంద్రలింగం, హనుమంతు, వెంకటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

కొడంగల్ రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను భర్త కడతేర్చిన ఘటన కొడంగల్ మండలంలో జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలంలోని చిన్న నందిగామకు చెందిన అంజనేయులు, మౌనిక(27) భార్యాభర్తలు. వీరికి వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించి సముదాయించేవారు. ఈ క్రమంలో అనుమానంతో మంగళవారం రాత్రి మౌనికను అంజనేయులు చితకబాదాడు. బుధవారం తెల్లవారుజామున గొంతు నులిమి చంపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలు మౌనిక తండ్రి కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



చేవెళ్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి స్వామివారికి హనుమంత వాహన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. కార్యక్రమంలో ధర్మకర్త డి.వామనాచార్యులు, అర్చకులు అనంతం, వాసు, శ్రీపాద్, కన్నా, వైభవ్ పాల్గొన్నారు.

లక్కీ చంద్రమ్మ!

దౌల్తాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రకల్ ఎంపీటీసీ పరిధిలో చంద్రకల్, కుప్పగిరి గ్రామాలున్నాయి. ఈ స్థానం ఎస్టీ జనరల్‌కు రిజర్వైంది. ఈ రెండు గ్రామాల్లో 4,030 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో చంద్రకల్‌కు చెందిన చంద్రమ్మ, ఆమె కొడుకు, కోడలు, కూతురు మాత్రమే ఎస్టీలు. దీంతో ఈ ఎంపీటీసీ పదవి ఆ కుటుంబానికే ఏకగ్రీవం కానుంది.

దివ్యాంగుడి కుటుంబంపై దాడి

● పోలీసులకు ఫిర్యాదు

బషీరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంటి వెనుక ఉన్న చెట్ల విషయమై తలెత్తిన గొడవలో ఓ దివ్యాంగుడి కుటుంబంపై భార్యాభర్తలు దాడి చేశారు. ఈ సంఘటన దామర్‌చెడ్‌లో జరుగగా బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సి.రాజు దివ్యాంగుడు,అతడి భార్య అర్చన ఇంటి వద్ద ఉండగా, పక్కింటి వెంకటయ్య, ఆయన భార్య భాగ్యమ్మ రాజు ఇంటికి వచ్చి దూషించారు. తనను నెట్టేశారని రాజు తెలిపాడు. అడ్డుకున్న రాజు భార్యను జుట్టుపట్టి కొట్టారు. అదే రోజు రాత్రి 12 గంటల తర్వాత వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రాజు దంపతులు కోరుతున్నారు.







రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


ప్రమాదానికి కారణమైన లారీ ➤

పూడూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సిమెంటు ట్యాంకర్, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కండ్లపల్లి గేటు వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేవెళ్ల మండలం మీర్జాగూడకు చెందిన ఇబ్రహీంపల్లి మల్లేష్ తన కారులో వికారాబాద్ వెళ్తున్నాడు. కండ్లపల్లిగేటు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న సిమెంటు ట్యాంకర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న మల్లేష్ కుడి కాలు, కుడి చెయ్యి విరిగాయి. స్థానికులు అతడిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం జరగడంతో కండ్లపల్లి గేటు మార్గంలో వాహనాలు పెద్దఎత్తున స్తంభించాయి. ఈ విషయం తెలుసుకున్న చెన్‌గోముల్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





కదులుతున్నరైలు ఎక్కబోయి ఏఎస్ఐ దుర్మరణం


మారుతి (ఫైల్)

తాండూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తాండూరు రైల్వే స్టేషన్ నుంచి కదులుతున్న రైలును ఎక్కబోయి ప్రమాదానికి గురైన రైల్వే ఏఎస్ఐ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి కల్బుర్గి జిల్లా జేడీ హల్లీ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి తాండూరు నుంచి బెంగళూర్ వెళ్లేందుకు వచ్చారు. అప్పటికే యశ్వంతపూర్ రైలు ముందుకు కదలడంతో మారుతి రైలు ఎక్కేందుకు పరిగెత్తాడు. ఈ క్రమంలో అదుపు తప్పి పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీలు కర్ణాటకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మారుతి బుధవారం మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి


బాషగోని చక్రపాణి(ఫైల్)

ఘట్‌కేసర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాషగోని చక్రపాణి(68) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడు. వారం క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. ఇంతలో గుండెపోటుతో మృతిచెందాడని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నాయకులు, కార్యకర్తలు, సంతాపం తెలిపారు.

బైక్‌పైనుంచి పడి జీపీవో మృతి

మోమిన్‌పేట్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారం క్లస్టర్ జీపీవోగా ఎస్.రాంచంద్రారెడ్డి పది రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. వారం క్రితం విధులు ముగించుకొని వికారాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తగడి సమీపంలో ఫిట్స్ రావడంతో బైక్‌పై వెళ్తున్న ఆయన అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని మెడిక్యూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని మోమిన్‌పేట్ తహసీల్దార్ రవీందర్, రెవెన్యూ సిబ్బంది పరామర్శించారు.


ఘట్‌కేసర్‌లోని మద్యం దుకాణం వద్ద రద్దీ

కిక్కిరిసిన మద్యం, మాంసం దుకాణాలు

- ఒకే రోజు దసరా, గాంధీ జయంతి
- నేడు అమ్మకాల నిషేధంతో ముందస్తు కొనుగోళ్లు

ఘట్‌కేసర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):గాంధీ జయంతి సందర్భంగా గురువారం మద్యం, మాంసం, చికెన్, చేపలు, బిర్యాని హోటళ్లను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. కాగా గాంధీ జయంతి, దసరా ఒకే రోజు వచ్చాయి. దసరా రోజు ఎక్కువ మంది మాంసాహారం భుజిస్తారు. అలాగే చాలా మంది మద్యం తాగుతారు. పండుగపూట ఇవి లేకుంటే ఎలా అని బుధవారమే మద్యం, మాంసం కొనుక్కున్నారు. రాత్రి పొద్దు పోయే వరకు మద్యం, మాంసం దుకాణాలు కిక్కిరిశాయి. ప్రధానంగా మద్యం దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. ఘట్‌కేసర్‌లో ఉన్న రెండు మద్యం దుకాణాల వద్ద మద్యం కొనుగోళ్లకు మద్యంప్రియులు బారులుతీరారు. అలాగే మాంసం దుకాణాలు, చికెన్ సెంటర్లు సైతం కిటకిటలాడాయి. అన్ని దుకాణాల వద్ద.. 'రేపు గురువారం. గాంధీ జయంతి సందర్భంగా దుకాణం బంద్.' అని బోర్డులు పెట్టడంతో ముందే కొనుగోళ్లు చేసుకున్నారు. 'సుక్క, ముక్క లేనిదే పండగపొద్దు గడవదు. ఇబ్బందులు పడాల్సిందే.' అంటూ మద్యం, మాంసం ప్రియులు రాత్రి పొద్దుపోయే దాకా దుకాణాల వద్ద వేచి ఉండి కొనుగోలు చేశారు.


ఘట్‌కేసర్‌లో మాంసం కొనుగోలు చేస్తున్న ప్రజలు

చెట్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- అద్రాస్‌పల్లిలో విషాదఛాయలు


ప్రమాదానికి గురైన కారు


ప్రమాదంలో మృతి చెందిన తనుష్

శామీర్‌పేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనగా ఒకరు మృత్యువాత పడ్డారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం లింగాపూర్ సమీపంలో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన దొండ రాజు కుమారుడు తనుష్(19), అదే గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు బి.సాయిదీపక్(16) ఇద్దరు కలసి బుధవారం ఉదయం 8.30గంటలకు కారులో డీజిల్ తీసుకురావడానికి మూడుచింతలపల్లిలోని పెట్రోల్ పంపునకు వెళ్లారు. డబ్బాలో డీజిల్ పోయించుకొని తిరిగి అద్రాస్‌పల్లికి వస్తున్నారు. కాగా, మార్గమధ్యంలో మూడుచింతలపల్లి దాటిన తర్వాత లింగాపూర్ తండా సమీపానికి రాగానే ఉదయం 9గంటల సమయంలో ప్రమాదవశాత్తు వారి కారు అదు పు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టి పల్టీకొట్టి నుజ్జునుజ్జు అయ్యింది. ఈ రోడ్డు ప్రమాదంలో కారు నడుపుతున్న తనుష్, పక్కన కూర్చున్న సాయిదీపక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను కీసరలోని లైఫ్‌లైన్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి తనుష్ మృతిచెందినట్లు నిర్ధారించారు. సాయిదీపక్‌ను మెరుగైన వైద్యం కోసం అల్వాల్‌లోని ఓజోన్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే తనుష్‌కు చెందిన ట్రాక్టర్‌కు డీజిల్ కోసం సొంత కారులో వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రాజుకు ఒక కుమార్తె, ఒక కుమారుడు తనుష్ ఉన్నారు. సాయిదీపక్ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శామీర్‌పేట పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట గ్రామంలో విషాదం

అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు తనుష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పండుగ పూట గ్రామంలో విషాదం నెలకొంది. తనుష్ మృతితో అతడి కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా విలపించారు. గ్రామస్తులు, నాయకులు సంతాపం తెలిపారు. యువడి అంత్యక్రియల్లో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు


ఐనాపూర్ పెద్ద చెరువు వద్ద ధ్వంసమైన బీటీ రోడ్డు


బొంపల్లి సమీపంలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

దోమ మండలంలోని ప్రధాన రోడ్లు ఇటీవలి భారీ వర్షాలతో దెబ్బతిన్నాయి. అయినాపూర్ పెద్ద చెరువు అలుగు రోడ్డుపై పారడటంతో బీటీ రోడ్డు కొట్టుకుపోయి ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా బొంపల్లి సమీపంలో ప్రధాన రోడ్డుపై మూలమలుపు వద్ద నీరు నిలిచి రోడ్డు ధ్వంసమైంది. గతుకుల రోడ్లతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- దోమ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)


పూడూరు : దుర్గామాతకు పూజలు చేస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


పరిగి: నస్కల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న కమిషనర్ వెంకటయ్య


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు, నిర్వాహకులు

ఘనంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు.. మహిళల సామూహిక కుంకుమార్చనలు


ఘట్‌కేసర్ రూరల్: కొర్రెములలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పూడూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూడూరు మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నిత్య పూజలందుకుంటున్నారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పరిగి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పరిగి మునిసిపల్ పరిధిలోని నస్కల్ గ్రామంలో అమ్మవారికి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మహిళలు కంకుమార్చన నిర్వహించారు.

కులకచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో బుధవారం సామూహిక కుంకుమ అర్చన చేశారు. దసరా నవరాత్రుల్లో భాగంగా దుర్గమాత మండపం ముందు మహిళలు పెద్ద ఎత్తున సామూహిక కుంకుమార్చన చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పాంబండ ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి దుర్గమాతకు పూజలు నిర్వహించారు.

ఘట్‌కేసర్ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహిషాసురమర్దిని దేవిగా అలంకరించారు. కొర్రెములలోని శ్రీ నీలకంఠ బ్రహ్మసూత్ర మహాకాళి దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి కవితావెంకటేష్‌గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆలయ పూజారి మూర్తిశర్మ, భక్తులు భవాని, లత, ఉమా, చంద్రిక, వనజ, దీపిక, శోభ, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు పట్టణంలోని వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, ఆయన సతిమణి కిష్టమ్మ(కోకట్ ప్రధానోపాధ్యాయురాలు) దంపతులు పాల్గొన్నారు. దసరాను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు.

దోమ: మండల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజీరెడ్డి, వైస్ ఎంపీపీ యాదయ్యగౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.

దసరా వేడుకలకు ఏర్పాట్లు

తాండూరు: తాండూరులో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే పాత తాండూరులోని బొనమ్మ దేవాలయం వద్ద దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటలకు పట్టణంలోని నెహ్రూగంజ్ దేవాలయం నుంచి భరతమాత చిత్రపటంతో శోభాయాత్ర బోనమ్మ దేవాలయం వరకు సాగుతుందని తెలిపారు. అక్కడ శమీ పూజ, పాలపిట్ట దర్శనం, రావణ సంహరణ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.


కులకచర్ల: ఇప్పాయిపల్లిలో సామూహిక కుంకుమార్చన


పరిగి: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు


తాండూరు: వినాయక ఆస్పత్రి వద్ద అన్నదానం


దోమ: దుర్గాదేవీ మండపం వద్ద అన్నదానం

సందడిగా బతుకమ్మ సంబురాలు

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు


శామీర్‌పేటలో బతుకమ్మ వేడుకలు


బొంరాస్‌పేట్: తుంకిమెట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శామీర్‌పేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో బుధవారం మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై అశోక్, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొడంగల్: హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డులోని హరే రామ, హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణ చైతన్య, రవీంద్ర, తరుణ్, రాజేశ్, రవి పాల్గొన్నారు.


కొడంగల్: బతుకమ్మతో హరే రామ, హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, మహిళలు

కల్యాణం.. కమనీయం

వికారాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని సూర్యప్రభ, గరుడ వాహన సేవపై ఊరేగించారు. గురువారం శమీ పూజ, చక్రస్నానం ధ్వజారోహణంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త లక్ష్మీ నారాయణ, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

